

సోయం.. అలక వీడేనా!?



- అసంతృప్తిలో బీజేపీ సిట్టింగ్ ఎంపీ సోయం బాపురావు
- పార్టీ కార్యక్రమాలు, ప్రచారానికీ దూరమే..
- ప్రస్తుత ఎంపీ అభ్యర్థి గోడం నగేష్‌కు మద్దతుపై అనుమానాలు
- అధిష్ఠానం పెద్దలు నచ్చచెప్పినా.. ఫలితం శూన్యం
- రాజకీయ భవిష్యత్తుపై తన అనుచరులతో రహస్య మంతనాలు



ఆదిలాబాద్, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): జిల్లా సిట్టింగ్ ఎంపీ సోయం బాపురావు ఇంకా అలక వీడినట్లు కనిపించడం లేదు. బీజేపీ సిట్టింగ్ ఎంపీని పక్కన పెట్టి కొత్తగా పార్టీలో చేరిన గోడం నగేష్‌ను బీజేపీ అభ్యర్థిగా ప్రకటించడంపై ఆయన తీవ్ర అసంతృప్తితో ఉన్నట్లు తెలుస్తుంది. రాష్ట్రవ్యాప్తంగా సిట్టింగ్‌లకు మళ్లీ అవకాశం ఇచ్చిన ఆదిలాబాద్ పార్లమెంట్ స్థానం అభ్యర్థిని మార్చడంపై ఆయన అనుచరులు భగ్గుమంటున్నారు. దాదాపుగా నెల రోజులుగా ఆయన పార్టీకి దూరం దూరంగానే ఉంటూ వస్తున్నారు. పార్టీలో కొందరు తనకు వ్యతిరేకంగా పని చేయడంతోనే అవకాశం రాకుండా పోయిందని తీవ్ర ఆరోపణలు కూడా చేశారు. పార్టీలో ఉంటూ ఆదివాసీల కోసం పని చేయడం తప్పేలా అవుతుందని మండిపడుతున్నారు. గతంలోనూ ఆదివాసీ ఉద్యమ నేతగా పని చేస్తేనే పార్టీ గుర్తించి టికెట్ ఇచ్చిందని ఇప్పుడు అదే పార్టీ ఉద్యమాన్ని తప్పుబట్టి పక్కన పెట్టడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. అంతేకాకుండా పార్టీ పక్కన పెట్టడంతో తన రాజకీయ భవిష్యత్తుపై గత కొద్దిరోజులుగా అనుచరులతో రహస్య మంతనాలు జరుపుతున్నారు. సరైన సమయంలో సరైన నిర్ణయం తీసుకుంటారని ఆయన సన్నిహితులు చెబుతున్నారు.



సోయం పార్టీకి దూరమైతే అభ్యర్థి గెలుపు అవకాశాలపై ప్రభావం పడుతుందన్న వాదనలు బలంగా వినిపిస్తున్నాయి.

తగ్గిన ప్రాధాన్యత

సోయం సిట్టింగ్ ఎంపీ అయినప్పటికీ గత కొంతకాలంగా పార్టీలో ప్రాధాన్యత తగ్గుతూ వస్తుందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఇటీవల ప్రధాని నరేంద్రమోదీ జిల్లాలో పర్యటించిన సమయంలోనూ ఆయనకు ప్రాధాన్యత ఇవ్వలేదన్న ప్రచారం సాగుతోంది. అప్పటి నుంచి పార్టీ ఆయనను పక్కన పెట్టిందన్న ప్రచారం జరిగింది. ఊహించిన విధంగానే పార్టీ ఆయనకు పార్టీ షాక్ ఇచ్చింది. దీంతో సోయం పార్టీ కార్యక్రమాలు, ప్రచారానికి దూరంగానే ఉంటూ వస్తున్నారు. ఎన్నికల సందర్భంగా పార్టీ ముఖ్య నేతలు జిల్లాలో పర్యటిస్తున్న ఆయన మాత్రం ఎక్కడ కనిపించడం లేదు. తాజాగా కర్ణాటక ఎమ్మెల్యే పర్యటన సందర్భంగా జిల్లాకేంద్రంలో ఏర్పాటు చేసిన పార్టీ సమావేశానికి ఆయన హాజరుకాకపోవడం చర్చనీయాంశంగా మారింది. పార్టీ అభ్యర్థిని ప్రకటించినప్పటి నుంచి ఇప్పటి వరకు అభ్యర్థితో కలిసి ప్రచారంలో పాల్గొన లేదు. ఆయన సొంత నియోజకవర్గం బోథ్‌లోనూ బీజేపీ పలు సమావే శాలను నిర్వహించిన దూరంగానే ఉంటూ వస్తున్నారు. ఇప్పటికీ కొందరు ఆయన దగ్గరి నేతలు పార్టీ అభ్యర్థి ప్రచారానికి అంటిముట్టనట్లుగానే వ్యవహరించడం పార్టీ వర్గాల్లో హాట్‌టాపిక్‌గా మారింది.

మండిపడుతున్న సోయం

లోక్‌సభ ఎన్నికల్లో కొత్తగా వచ్చిన వలస నేతకు అవకాశం ఇవ్వడంపై ఎంపీ సోయం మండిపడుతున్నట్లు తెలుస్తుంది. ఇన్నాళ్లు పార్టీని నమ్ముకుని పని చేసిన నేతల పరిస్థితి ఏమిటన్న వాదనలు వినిపిస్తున్నాయి. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో తనకు వ్యతిరేకంగా పని చేసిన అభ్యర్థికి ఇప్పుడు తానేలా మద్దతు ఇవ్వాలని ప్రశ్నిస్తున్నారు. గత ఎన్నికల్లో తనపై రెండు సార్లు ఓటమి పాలైన నేతకు పార్టీ అవకాశం ఇవ్వడాన్ని తీవ్రంగా తప్పుబడుతున్నారు. తన గెలుపుతోనే ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లాలో బీజేపీ బలపడిందని, దానిని గుర్తించకుండా పార్టీ వలస నేతకు అవకాశం ఇవ్వడం సరికాదన్న అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నారు. ప్రశ్నించే గొంతును అణిచి వేయాలని చూడడం సరికాదన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

నామిటేడ్‌పై అనుమానాలు

ఇటీవల పార్టీ కేంద్ర అధిష్ఠానం పెద్దలు సోయంను ఢిల్లీకి పిలిపించి కేంద్రస్థాయిలో నామినేట్ పదవిని ఇస్తామని చెప్పిన సోయం నారాజుగానే ఉన్నట్లు కనిపిస్తుంది. అసలు టికెట్ ఇవ్వని పార్టీ ఇక నామినేట్ పదవి ఎలా ఇస్తుందనే వాదనలు వినిపిస్తున్నాయి. అధిష్ఠానం ఇచ్చిన హామీపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఎందుకంటే ఎన్నికల వరకు సోయం పార్టీ వీడకుండా అధిష్ఠానం జాగ్రత్త పడుతున్నట్లు తెలుస్తుంది. అయితే ఆయన మాత్రం వెనక్కి తగ్గినట్లు కనిపించడం లేదు. ఇప్పటికే తాను లోక్‌సభ ఎన్నికల బరిలో ఉంటానని ప్రకటించడం పార్టీ వర్గాల్లో దుమారం రేపుతుంది. ఆయన రెబల్‌గా బరిలోకి దిగితే ఇతర పార్టీలకు కలిసి వచ్చే అవకాశం ఉందంటున్నారు. పార్టీ అభ్యర్థి గెలుపు అవకాశాలు దూరమవుతాయన్న వాదనలు కూడా వినిపిస్తున్నాయి. గత ఎన్నికల్లో అనూహ్యంగా బీజేపీ పార్టీలో చేరి ఘన విజయం సాధించిన సోయం బాపురావు ఐదేళ్ల తర్వాత పరిస్థితులు ఒక్కసారి తలకిందులు కావడంతో ఆయన రాజకీయ భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిందని రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.



కౌంటింగ్ కేంద్రం వద్ద వివరాలు తెలుసుకుంటున్న కలెక్టర్ రాజార్షిషా

కౌంటింగ్ కేంద్రాన్ని పరిశీలించిన కలెక్టర్

ఆదిలాబాద్ అర్బన్, ఏప్రిల్ 10: రానున్న లోక్‌సభ ఎన్నికల సందర్భంగా స్థానిక టీటీడీసీలో ఏర్పాటు చేసిన కౌంటింగ్ కేంద్రాన్ని బుధవారం జిల్లా కలెక్టర్ రాజార్షిషా పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఓట్ల లెక్కింపు, ఎన్నికల సామాగ్రి పంపిణీ, పోలింగ్ ముగిసిన అనంతరం ఈవీఎంలను భద్రపరిచేందుకు స్ట్రాంగ్‌రూమ్,మీడియా సెంటర్ ఏర్పాటు వసతులను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. రవాణా, పార్కింగ్ సదుపాయాలతో పాటు భద్రత పరమైన అంశాలను నిశితంగా పరిశీలించి అన్ని ఏర్పాట్లను త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఇందులో ఆర్డీవో వినోద్‌కుమార్, ఎన్నికల సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

● 'పండుగను ఘనంగా జరుపుకోవాలి'

ఆదిలాబాద్ అర్బన్: పవిత్ర మాసమైన రంజాన్‌లో నెల రోజుల పాటు అత్యంత భక్తిశ్రద్ధలతో కఠోర ఉపవాస దీక్షలు చేపట్టి అల్లాను ప్రార్థించి ఆధ్యాత్మిక జీవనం కొనసాగించారని జిల్లా కలెక్టర్ రాజార్షిషా తెలిపారు. రంజాన్ పండుగ సందర్భంగా జిల్లాలోని ముస్లిం సోదరులకు కలెక్టర్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నెల వంకతో రంజాన్ దీక్షలు ప్రారంభమై.. మళ్లీ నెల వంక దర్శనంతో రంజాన్ పండుగను జరుపుకుంటారని, ఈ పర్వదినాన్ని పురస్కరించుకుని జిల్లాలోని ముస్లీం సోదరులు, సోదరీమణులు ఆనందోత్సవాలతో, భక్తిశ్రద్ధలతో పండుగను ఘనంగా జరుపుకోవాలని ఆయన కోరారు.

సాలెవాడ(కే)లో అంబేద్కర్ విగ్రహావిష్కరణ

ఉట్నూర్, ఏప్రిల్ 10: మండలంలోని సాలెవాడ(కె)లో రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహావిష్కరణ కార్యక్రమం బుధవారం ఘనంగా జరిగింది. ఎంపీపీ పంద్ర జైవంత్‌రావు హాజరై అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఎంపీపీ మాట్లాడుతూ అంబేద్కర్ అడుగుజాడల్లో ప్రతీఒక్కరు నడవాలని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ అంబేద్కర్ కమిటీ సభ్యులు, గ్రామపటేళ్లు, గ్రామస్థులు, పురుషులు, మహిళలు భారీ సంఖ్యలో హాజరు కాగా, రాథోడ్ శారదా బలిరాం, ఎంపీటీసీ పులిమడుగు ఎంపీటీసీ నల్గర్ రవీందర్, సర్పంచ్ హరిత, సింగారే భారత్, ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.



అంబేద్కర్ విగ్రహాన్ని ప్రారంభిస్తున్న ఎంపీపీ

కురిసిన జల్లులు.. చల్లబడిన వాతావరణం

ఆదిలాబాద్, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): ఇన్నాళ్లు భానుడి భగభగలతో అల్లాడిన కురిసిన చిరుజల్లులతో వాతావరణం చల్లబడింది. దీంతో జిల్లా ప్రజలకు కొంత ఉపశమనం కలిగింది. రాత్రి ఆదిలాబాద్ అర్బన్‌తో పాటు నార్నూర్ మండలంలో 20 మి.మీ.లకు పైగా వర్షపాతం కురిసింది. మిగితా చోట్ల ఉరుములు, మెరుపులతో కూడిన జల్లులు కురిశాయి. బుధవారం జిల్లా సగటు ఉష్ణోగ్రతలు 37.8 కాగా, కనిష్ఠంగా 21.7డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోద య్యాయి. అత్యల్పంగా ఉట్నూర్ మండలంలో 33.5 ఉష్ణోగ్రతలు నమోదైనట్లు అధికారిక లెక్కల ప్రకారం తెలుస్తుంది. మరో రెండు రోజుల పాటు జిల్లాలో ఓ మోస్తారు స్థాయిలో వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ నిపుణులు పేర్కొంటున్నారు. అయితే ఇప్పటికే చేతికి వచ్చిన జొన్న పంట అకాల వర్షాలకు తడిసి ముద్దవుతుందని రైతులు ఆందోళనకు గురవుతున్నారు. ఉరుములు, మెరుపులతో కూడిన జల్లులు కురవడంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సంబంధిత వాతావరణ శాఖ అధికారులు సూచించారు.

● తాంసిలో నేలకొరిగిన జొన్న

తాంసి: మండలంలోని ఆయా గ్రామాలలో మంగళ, బుధవారాల్లో ఈదురు గాలితో కూడిన వర్షం కురిసింది. దీంతో జొన్న పంటకు కొంత మేర నష్టం వాటిల్లినట్లు అయిందని జొన్న రైతులు పేర్కొంటున్నారు. బుధవారం సాయంత్రం సైతం ఈదురుగాలులతో కూడిన చిరుజల్లులు కురియడంతో కొంతమేర నష్టం వాటిల్లిందని అంటున్నారు. కొందరికి మాత్రం ఈ వర్షం లాభదాయకమేనని పేర్కొంటున్నారు. మొత్తమీద ఈదురుగాలితో కూడిన వర్షం కొంత నష్టం కొంత లాభాన్ని కలిగించినట్లు అయిందని రైతులు తెలిపారు.



తాంసిలో ఈదురుగాలులకు నేలకొరిగిన జొన్న పంట



ఆలయంలో పూజలు చేస్తున్న ఆదివాసీలు



భక్తులతో కిటకిటలాడుతున్న ఆలయ ప్రాంగణం

ఇంద్రాదేవికి చైత్రమాసం ప్రత్యేక పూజలు

● ఆలయంలో మొక్కులు చెల్లించుకున్న ఆదివాసీలు

ఇంద్రవెల్లి, ఏప్రిల్ 10: ఆదివాసీల ఆరాధ్య దైవం మండల కేంద్రంలోని ఇంద్రాదేవి ఆలయంలో చైత్రమాస ప్రత్యేక పూజా కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. దీనిలోభాగంగా బుధవారం మండల కేంద్రానికి చెందిన ఆదివాసీ గిరిజనులు కుటుంబ సమేతంగా ఇంద్రాదేవి ఆలయానికి తరలివచ్చారు. ఇంద్రాదేవికి పూజలు చేసి నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఆదివాసీ గిరిజనులు పెద్ద సంఖ్యలో తరలిరావడంతో ఆలయం భక్తులో కిటకిటలాడింది. కుటుంబ సమేతంగా సహపంక్తి భోజనాలు చేశారు. అంతేకాకుండా యేటా చైత్ర మాసం ఇంద్రాదేవి ఆలయంలో పూజలు నిర్వహిస్తామని వారు తెలిపారు. ఇంద్రాదేవి ఆలయంలో పూజలు చేసి నైవేద్యాలు సమర్పించడం ద్వారా గ్రామాల్లో ఎలాంటి కీడు జరగదని ప్రజలు సుఖ శాంతులతో ఉంటారని వారు నమ్ముతున్నట్లు తెలిపారు. చైత్రమాసం ముగింపు వరకూ ఆలయంలో పూజలు కొనసాగుతాయని ఆలయ మహారాజ్ చహకటి సూర్య రావు తెలిపారు. ఈ కార్యక్రమంలో గోండువాడ పటేల్, మడావి ఇంద్రు, ప్రధాన్‌గూడ పటేల్, గేడం జ్ఞానేశ్వర్, మరప రాజు, చహకటి నాగోరావు, తదితరులు పాల్గొన్నారు.

పేద ముస్లిం కుటుంబాలకు నిత్యావసర సరుకులు

ఉట్నూర్, ఏప్రిల్ 10: ఉట్నూర్ మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బుధవారం ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మబొజ్జు పటేల్ రంజాన్ పండుగ సందర్భంగా నిరుపేద ముస్లిం కుటుంబాలకు నిత్యావసర సరుకుల కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్ మాట్లాడుతూ రంజాన్ పండుగ సందర్భంగా నిరుపేద ముస్లింల జాబితా తయారు చేసి.. ఆ జాబితా ప్రకారంగా భర్తలు కోల్పోయిన ఒంటరి మహిళలకు, నిస్సాయస్థితిలో ఉన్న నిరుపేద ముస్లిం కుటుంబాలకు తనవంతుగా ఉట్నూర్ పట్టణంలో 200 మందికి.. అదేవిధంగా నియోజకవర్గం మొత్తంలో 500 మందికి నిత్యావసర కిట్లు పంపిణీ చేస్తున్నామని ఎమ్మెల్యే ఈ సందర్భంగా తెలిపారు. దాతలు సైతం ముందుకు వచ్చి ఇలాంటి నిరుపేదలకు సహాయం చేయాలని ఆయన కోరారు. హిందూ, ముస్లిం, సిఖ్, ఇసాయి, ఇలా అన్ని వర్గాల ప్రజలు కలిసిమెలిసి ఉంటూ ఆయురారోగ్యాలతో జీవించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, నిరుపేద మైనార్టీ ప్రజలు పాల్గొన్నారు.

బోథ్: మండల కేంద్రానికి చెందిన మీర్ ఇర్షద్ అలీ అనే యువకుడు బుధవారం పేద ముస్లిం కుటుంబాల వారికి కిరాణా సరుకులు పంపిణీ చేశారు. రానున్న రంజాన్ పండుగను సుఖ సంతోషాలతో ప్రతీ వారు జరుపుకోవాలని, పేదలకు నిత్యావసర సరుకులు పంపిణీ చేయడం జరిగిందన్నారు.



ఉట్నూర్‌లో పేద ముస్లింలకు రంజాన్ కిట్లు అందిస్తున్న ఎమ్మెల్యే బొజ్జుపటేల్





జిల్లాకేంద్రంలో రంజాన్ పండుగకు సిద్ధమవుతున్న ఈద్గా మైదానం

రంజాన్‌కు ముస్తాబైన ఈద్గా మైదానం

ఆదిలాబాద్ అర్బన్, ఏప్రిల్ 10: రంజాన్ పండుగ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనాల కోసం జిల్లాకేంద్రంలోని ఈద్గా మైదానం సిద్ధమయ్యింది. స్థానిక మున్సిపల్ అధికారులు ఇక్కడ ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా నమాజ్‌కు వచ్చే వారి సౌకర్యార్థం అన్ని ముందుస్తు ఏర్పాట్లు చేశారు. దీనిలో భాగంగా బుధవారం శానిటరి ఇన్స్‌పెక్టర్ నరేందర్ రంజాన్ పర్వదినం సందర్భంగా ప్రత్యేక ఏర్పాట్లను పరిశీలించి పలు సూచనలు, సలహాలు అందజేశారు. పారిశుధ్యంతో పాటు నీటి ఇబ్బందులు రాకుండా చూడాలని సిబ్బందికి సూచించారు. ఈ సందర్భంగా నరేందర్ మాట్లాడుతూ గురువారం పండుగ నమాజ్ కోసం ఈద్గా మైదానంలో మున్సిపల్ తరపున అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. ఈ సందర్భంగా ముస్లిం సోదరులకు ఆయన రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు.

సంక్షిప్త సమాచారం

నేటి పూలే విగ్రహ ప్రతిష్ఠాపన

తాంసి, ఏప్రిల్ 10: మండల కేంద్రమైన తాంసిలో నూతనంగా ఏర్పాటు చేసిన జ్యోతిబా పూలే, సావిత్రీబాయి పూలే విగ్రహాల ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని గురువారం నిర్వహిస్తున్నట్లు మాలి సంఘం నాయకులు ఉమేష్ జోలే బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమాన్ని సాయంత్రం నాలుగున్నర గంటల ప్రాంతంలో ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. గ్రామస్థుల సహకారం, తమ సంఘం తరఫున జ్యోతిబా పూలే, సావిత్రీబాయి పూలే విగ్రహాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మండలంలోని ఆయా గ్రామాలలో ఉన్న మాలి సంఘం కులస్తులతో పాటు బీసీ సంఘం నాయకులు హాజరు కావాలని కోరారు. కార్యక్రమానికి రాష్ట్ర నాయకులు హాజరవుతారని తెలిపారు.

అభ్యర్థి గెలవాలని పాదయాత్ర

ఆదిలాబాద్ అర్బన్, ఏప్రిల్ 10: కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణ గెలవాలని ఆ పార్టీ ఓబీసీ పట్టణ అధ్యక్షుడు గంద్రత్ వెంకన్న పాదయాత్ర చేపట్టారు. బుధవారం బెల్లూరి అయ్యప్ప ఆలయం నుంచి చేపట్టిన ఈ పాదయాత్రను కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు గుడిపెల్లి నగేష్ ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎంపీగా ఆత్రం సుగుణ, కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రావాలని సంకల్పించి వెంకన్న పాదయాత్ర చేపట్టారని తెలిపారు. అయ్యప్ప ఆలయం నుంచి కామారెడ్డి తడ్వాయి శబరిమాత ఆలయం వరకు 220 కి.మీ.ల వరకు పాదయాత్ర సాగుతుందన్నారు. పార్టీ అధికారంలోకి రావాలని పాదయాత్ర చేపట్టిన వెంకన్నను పార్టీ శ్రేణులు ఘనంగా స్వాగతించాలని కోరారు.

12న జిల్లా సదస్సు : లంక

ఆదిలాబాద్ అర్బన్, ఏప్రిల్ 10: ఈనెల12న సీఐటీయూ కార్యాలయంలో 'ఉపాధి హామీ కూలీల సమస్యలు-పరిష్కార మార్గాలు' అనే అంశంపై జిల్లా సదస్సు నిర్వహిస్తున్న తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు లంక రాఘవులు తెలిపారు. ఈ సదస్సును ఉదయం 10 గంటలకు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. బుధవారం సుందరయ్య భవనంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలోని ఉపాధి హామీ కూలీలు తీవ్ర సమస్యలు ఎదుర్కొంటున్నారని, పని ప్రదేశంలో తగిన సౌకర్యాలు మంచినీరు, టెంట్, మెడికల్‌కిట్, పనిముట్లు సౌకర్యాలు కల్పించకుండా అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారని మండిపడ్డారు. 13 నుంచి 15 వారాల ఉపాధి పెండింగ్ బిల్లులు ఉన్నాయని, వాటిని వెంటనే కూలీల ఖాతాలో వేయాలని డిమాండ్ చేశారు. కేంద్రం ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేసేందుకు ప్రయత్నిస్తోందని, కేంద్ర ప్రభుత్వ ఉపాధి హామీ వ్యతిరేక విధానాలు, జిల్లాలోని సమస్యలపై సదస్సు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సదస్సుకు వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్.వెంకట్ రాములు ముఖ్యఅతిథిగా హాజరవుతున్నారన్నారు. ఉపాధి కూలీలు అధికసంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని కోరారు. ఇందులో సంఘ జిల్లా అధ్యక్షుడు స్వామి, సహాయ కార్యదర్శి కె.ఆశన్న, నాయకులు భీంరావు, మంజుల, పూసం సచిన్, తదితరులున్నారు.



మాట్లాడుతున్న లంక రాఘవులు



జాతరకు ముస్తాబైన హరిహర ఆలయం

జాతరకు ముస్తాబైన హరిహర క్షేత్రం

పెంబి, ఏప్రిల్ 10: మండల కేంద్రంలోని హరిహర క్షేత్రం జాతరకు ముస్తాబైంది. ప్రతీ సంవత్సరం ఉగాది తరువాత రెండు రోజులకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా నిర్వహించనున్నారు. హరిహర ఆలయ ఉత్సవాలు గురువారం శ్రీనరసింహ మూర్తి యజ్ఞాచార్యులచే అభిషేక ఆరాధనలు, స్వస్తిక్ పుణ్యాహవాచనం, రక్షా బంధనం, అంకురారోపణం, కలశ స్థాపనం, అగ్ని ప్రతిష్ట, యజ్ఞ కార్యక్రమం, ఆలయ బలిహరణం, సాయంత్రం సాంస్కృతిక ర్యాక్రమాలు, 12న పుణ్యాహవాచనం, దేవత ఆరాధనలు, అభిషేకం, యజ్ఞం, కుంకుమార్చన, ఆలయ బలి హరణం, తీర్థప్రసాద వితరణ, 13న నిత్య విధి ఆరాధనలు, పుణ్యాహవాచనం, ఆలయ బలిహరణం, గ్రామ బలి, పూర్ణాహుతి, శ్రీహరిహరుల కల్యాణం, మ్యాక్స్ సొసైటీ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం ఉంటాయని నిర్వాహకులు తెలిపారు. అనంతరం హరిహర ఆలయ పల్లకీ సేవ కార్యక్రమం, జాతరకు అన్ని గ్రామాల నుంచి ప్రజలు అధిక సంఖ్యలో హాజరై స్వామివారి ఆశీస్సులు పొందాలని ఆలయ కమిటీ, వీడీసీ కమిటీ సభ్యులు పేర్కొన్నారు.

పాఠశాలను పరిశీలించిన ఆర్డీవో

ముథోల్, ఏప్రిల్ 10: పార్లమెంట్ ఎన్నికలు త్వరలో జరగనున్న నేపథ్యంలో ఈవీఎంలు భద్రపరిచేందుకు స్ట్రాంగ్ రూమ్, ఈవీఎంల డిస్ట్రిబ్యూటర్ సెంటర్ కోసం ముథోల్‌లోని ప్రభుత్వ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలను బుధవారం సాయంత్రం ఆర్డీవో కోమల్ రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా పాఠశాలలోని పలు గదులను ఆయన కలియతిరిగి పరిశీలించారు. పలు వివరాలను తహసీల్దార్ విఠల్, ఆర్ఐ నారాయణలకు అడిగి తెలుసుకున్నారు.

తానూర్‌లో ఒకరి ఆత్మహత్య

తానూర్, ఏప్రిల్ 10: మండల కేంద్రం తానూర్‌కు చెందిన అవదుత్వార్ లచ్చిరాం(59) అనే వ్యక్తి అనారోగ్యం కారణంగా ఉరి వేసుకొని ఆత్మహత్యకు చేసుకున్నట్లు ఎస్సై లోకం సందీప్ తెలిపారు. వివరాల ప్రకారం.. మృతుడు లచ్చిరాం గత కొన్ని రోజులుగా బోదకాలు వ్యాధితో బాధ పడుతున్నాడని తెలిపారు. అయితే కాలికి ఆపరేషన్ అయ్యిందని, కాళ్ల నొప్పులు భరించలేక బుధవారం ధర్మాబాద్ రోడ్డులోని తన పక్క చేనులో గల వేప చెట్టుకు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య గంగాబాయి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.


కలశంతో శోభాయాత్ర నిర్వహిస్తున్న ఆదివాసీ భక్తులు

విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలు ప్రారంభం

ఉట్నూర్, ఏప్రిల్ 10: మండలంలోని సాలెవాడ(బి)లో ఈనెల12న హనుమాన్ విగ్రహ ప్రతిష్ఠాపన సందర్భంగా బుధవారం ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. మండలంలోని కుమ్మరితండా హనుమాన్ మందిరం నుంచి ఆదివాసీ భక్తులు సాలెవాడకు కలశాలతో శోభాయాత్ర నిర్వహించారు. అనంతరం గణపతి పూజ పురావచనము, జలది నివాసము, కార్యక్రమాలను నిర్వహించారు. ఆలయ ప్రారంభోత్సవం సందర్భంగా విష్ణు మహారాజ్ ప్రవచనాలు, జైవంత్‌రావు మహారాజ్ ప్రవచనాలు వినాయకరావు మహారాజ్ ప్రవచనాలు ఉంటాయని నిర్వాహకులు తెలిపారు. కలశ స్థాపన అనంతరం 12న రాంసింగ్ మహరాజ్, కోరంగ యశ్వంత్‌రావు మహరాజ్, సురేష్ మహరాజ్‌ల ఆధ్వర్యంలో హనుమాన్ విగ్రహం ప్రతిష్ఠాపన కార్యక్రమాలు జరుగుతు అయని తెలిపారు. కాగా, ఖానాపూర్ ఎమ్మెల్యే బొజ్జుపటేల్ హాజరై పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మరపా బాజీరావు, మేస్రం నాగోరావు, మరప శేకు, మారప నాగోరావు, మేస్రం కోసేరావు, ఆడరాము, పెందోర్ జగన్నాథరావు, మెస్రం చందు, మరాప జల్పత్‌రావు, తదితరులు పాల్గొన్నారు.


ఆలయ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న అధికారులు

అడెల్లి ఆలయ నిర్మాణ పనుల పరిశీలన

సారంగాపూర్, ఏప్రిల్ 10: మండలంలో గల అడెల్లి మహా పోచమ్మ నూతన ఆలయ నిర్మాణ పనులను బుధవారం దేవాదాయ శాఖ అధికారులు స్థపతి వల్లినయాగం సబ్ ఇంజనీర్ మల్లికార్జున్ రెడ్డిలు పరిశీలించారు. ఆలయంలో నూతన విగ్రహం ఏర్పాటు, పోతరాజు, ద్వారక శక్తుల విగ్రహాలతో పాటు దీప స్తంభం ఏర్పాటుకు కమిషనర్ అనుమతులను పొందేందుకు ఆలయ నిర్వాహకులకు ఆదేశాలను జారీ చేశారు. అలాగే ఆలయ నిర్మాణ పనులు వెంటనే పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో దేవాదాయ శాఖ అధికారులు గణేషన్, ప్రభాకర్, వేణుగోపాల్, రంగు రవికిషన్‌తో పాటు భక్తులు ఉన్నారు.

ప్లాస్టిక్ వద్దు.. మట్టి పాత్రలే ముద్దు!



- పాత కాలం నాటి పాత్రలపై నేటి తరం ఆసక్తి
- మట్టి పాత్రలే ఆరోగ్యానికి ఎంతో మేలంటున్న నిపుణులు
- బహిరంగ మార్కెట్లో ఆదిలాబాద్ రంజన్లకు భలే డిమాండ్
- వేసవి సీజన్ కావడంతో జోరుగా విక్రయాలు

ఆదిలాబాద్ అర్బన్, ఏప్రిల్ 10: ఉరుకుల పరుగుల జీవితాలు.. చేతిలో ప్లాస్టిక్ మంచి నీళ్ల బాటిళ్ల లేనిదే ముందుకు సాగని పయనాలు. మరో వైపు ఇంట్లో తినే పాత్రల దగ్గర నుంచి అన్నీ ప్లాస్టిక్‌తో పాటు ఇనుము సామాన్లే. దీంతో చాలా మంది అనా రోగ్యాల పాలు అవుతున్నారు. అందుకే పాతకాలం పద్ధతులను ఆచరించడానికి నేటి తరం వారు ప్రస్తుతం ఆసక్తి చూపుతునాకుం అంతేకాకుండా వేసవి కాలంలో వాడే మట్టి పాత్రలను నేటి తరం వారు నిత్యం వాడుతూ ఆరోగ్యాలను కాపాడుకుంటున్నారు.

అప్పట్లో అన్నీ మట్టి పాత్రలే!!

గతంలో ప్రతీ ఇంట్లోనూ మట్టితో తయారు చేసిన పాత్రలుండేవి. వంటలు తయారు చేయడం దగ్గర్నుంచి అన్ని అవసరాలకు మట్టి పాత్రలనే వాడేవారు. నేటి తరంలో సాంకేతిక పరిజ్ఞానం రావడానికి తోడు మట్టి ఉత్పత్తిదారులు, తయారీదారులకు సరైన ఉపాధి లేక పోవడంతో క్రమేణ వాటి సంఖ్య తగ్గుతూ వచ్చింది. ఒకప్పుడు మంచి నీళ్లను తాగాలంటే మట్టికుండను కొనుగోలు చేసి అందులో మంచి నీరు ఉంచుకుని తాగేవారు.ఇది ఆరోగ్యానికి కూడా మంచిగా ఉపయోగపడేది. ఈ నేపథ్యంలో ప్రస్తుత కాలంలో ప్లాస్టిక్ సీసాలకు బదులు మట్టి సీసాలు కూడా అందుబాటులో ఉన్నాయి. వీటిని వినియోగించడానికి కూడా ప్రజలు ఆసక్తి చూపిస్తున్నారు.

మట్టి పాత్రల్లో వంట అదుర్స్

జిల్లా అంతటా పేరొందిన రెస్టారెంట్లలో కూడా బిర్యానికి ఉన్నంత గిరాకీ మరేతర ఆహార పదార్థాలకు ఉండవనేది అతిశయోక్తి కాదు. మట్టి పాత్రలను హోటళ్ల వారు ఎక్కువగా తీసుకు వెళ్తారు. వీటినే హోటళ్లలో వినియోగిస్తున్నారు. దీంతో పాటుగా కాపీ షాపుల నుంచి ఐస్‌క్రీమ్ పార్లర్ వారు కూడా వీటికి అలవాటు పడుతున్నారు. ఖర్చు తక్కువతో కూడిన పాత్రలు కాబట్టి వీటిని కొనుగోలు చేయడం ద్వారా కూడా చేతి పని వారికి ఉపాధి దొరుకుతుందన్న భావన చాలా మందిలో నాటుకు పోయింది. జిల్లాలో మట్టితో పాత్రలు తయారు చేసేందుకు కుమ్మరులకు ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. గతంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక శిక్షణ తరగతులను సైతం నిర్వహించారు. అంతే కాకుండా గతంలో గుజరాత్ రాష్ట్రంలో కుమ్మరి కులస్థులను తీసుకెళ్లి మట్టి పాత్రల తయారీపై ప్రత్యేక అవగాహనను కల్పించారు. అక్కడ వివిధ రకాల మట్టి పాత్రల తయారీ పై అవగాహన కల్పించారు. చాలా మంది మట్టి పాత్రలు తయారు చేసే పనినే తమ వృత్తిగా భావిస్తారు. ప్రస్తుత కాలంలో ప్లాస్టిక్ వినియోగంతో ప్రజలు అనారోగ్యం పాలవుతున్నారని వైద్యులు అంటున్నారు. మట్టి పాత్రలను ఉపయోగించడం వల్ల ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చంటున్నారు.


బహిరంగ మార్కెట్‌లో విక్రయించేందుకు సిద్ధంగా ఉన్న కుండలు, రంజన్లు, మట్టిపాత్రలు(ఇన్‌సెట్‌లో ఆదిలాబాద్ రంజన్లు)

రంజన్‌లకు పెట్టింది పేరు ఆదిలాబాద్

వేసవి కాలంలో పేదోడి ఫ్రిజ్‌గా పేరున్న మట్టి కుండ రంజన్‌లకు పెట్టింది పేరు ఆదిలాబాద్. వేసవి కాలంలో ఆదిలాబాద్‌లో తయారు చేసిన మట్టి కుండను వివిధ జిల్లాలకు ఇక్కడి నుంచే సరఫరా చేస్తారు. మట్టి కుండలోని నీరు ఆరోగ్యానికి మేలు చేస్తాయని పలువురు పేర్కొంటున్నారు. రోజురోజుకు పెరుగుతున్న శాస్త్ర సాంకేతికతకు మట్టి కుండలకు సైతం నల్లలు అమర్చి నీటిని తాగేందుకు ఉపయోగిస్తున్నారు. కూలీనాలి చేసి జీవనం సాగించే పేదోడికి మాత్రం మట్టితో చేసిన రంజనే సంతృప్తినిస్తుంది. దానిలోని నీళ్ల తాగితే పొందే ఉపశమనమే వేరు. అందుకు వేసవి కాలం వచ్చి ఎండలు మండుతుండడంతో జిల్లాలో మట్టి కుండలు (పేదోడి ఫ్రిజ్) సిద్ధమవుతుంది. జిల్లాలో గల కుమ్మరులకు ప్రభుత్వం మరింత ప్రోత్సాహం అందిస్తే మట్టి పాత్రలను తయారు చేసేందుకు వారు సిద్ధంగా ఉన్నారు.

వేసవి సెలవుల్లోగా బదిలీల షెడ్యూల్ ప్రకటించాలి

- గిరిజన సంక్షేమ ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు

ఉట్నూర్, ఏప్రిల్ 10: వేసవి సెలవుల్లోగా గిరిజన సంక్షేమ శాఖ ఉపాధ్యాయుల బదిలీల షెడ్యూల్ ప్రకటించాలని గురుకుల పాఠశాలలో పని చేస్తున్న ఉపాధ్యాయులతో సమానంగా ఆశ్రమ పాఠశాలలో పని చేస్తున్న ఉపాధ్యాయులకు వేతనం చెల్లించాలని, వేతన స్కేల్లో ఉన్న వ్యత్యాసాన్ని ఈపీఆర్‌సీలో సరి చేయాలని, కన్వర్టెడ్ ఆశ్రమ పాఠశాలలో రెగ్యులర్ పోస్టులు మంజూరు కొరకు ప్రతిపాదనలు పంపించాలని తెలంగాణ గిరిజన సంక్షేమ ఉపాధ్యాయ సంఘం ప్రతినిధులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం హైదరాబాద్ వెళ్లి సీఎం పర్సనల్ సెక్రటరీ శేషాద్రి, ప్రిన్సిపల్ సెక్రటరీ శరత్, గిరిజన సంక్షేమ శాఖ కమిషనర్‌లను కలిసి వినతిపత్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా వారు హైదరాబాద్ నుంచి ఫోన్‌లో మాట్లాడుతూ గిరిజన సంక్షేమ శాఖ ఉపాధ్యాయుల బదిలీల, ప్రమోషన్ల కోసం షెడ్యూల్ విడుదల చేసి ఈ ప్రక్రియను మే నెలలోపు పూర్తి చేయాలని కోరినట్లు తెలిపారు. సీఆర్‌టీలను రెగ్యులర్ చేయాలని గిరిజన సంక్షేమశాఖ వసతి గృహాల మెస్ బిల్లులను చెల్లించాలని, మారిన రేట్లను దృష్టిలో ఉంచుకుని మెస్ చార్జీలు పెంచాలని, ఆశ్రమ పాఠశాలల్లో ప్రధానోపాధ్యాయుల నుంచి వసతి గృహ బాధ్యతలను తొలగించి మిగిలిన ఎస్‌జీటీ ఉపాధ్యాయుల తొలి హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ పోస్టులను భర్తీ చేయాలని, ప్రతి పీఎంఆర్‌సీ పరిధిలో ఒక జిల్లా క్రీడల అధికారి పోస్టు మంజూరు చేయాలని, గిరిజన సంక్షేమ శాఖ పీజీ హెచ్‌ఎం సమానస్థాయి పోస్టులు ఎంఈవో, డిప్యూటీ డీఈవో, డీఈవో స్థాయి పోస్టులు మంజూరు చేయాలని,వీటి ద్వారా వెల్ఫేర్ అధికారుల పెత్తనాలు పోయి విద్య అధికారులు మోనిటరింగ్ చేసే విధంగా చర్యలు చేపట్టాలని కోరారు. ఈ సమస్యలపై సానుకూలంగా స్పందించిన అధికారులు అన్ని సమస్యలను తప్పకుండా పరిష్కరిస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాములునాయక్, వారితో పాటుగా రాష్ట్ర గౌరవ సలహాదారులు సుధాకర్, మడావి లక్ష్మణ్, అసోసియేట్ ప్రెసిడెంట్ బయ్యన్న, రాష్ట్ర గౌరవ అధ్యక్షులు అశోక్, రాష్ట్ర ఉపాధ్యక్షులు కె.చంద్రశేఖర్‌రావు,రాష్ట్ర నాయకులు బి.వెంకటేశ్వర్లు, తిరుపత య్య, రాంలాల్, లింగాల, శ్రీరాములు, సారయ్యదొర, చందన్, డి.గోపాల్, తదితరులు పాల్గొన్నారు.


సీఎం పర్సనల్ సెక్రటరీని కలిసిన ఉపాధ్యాయ సంఘ ప్రతినిధులు


వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరైన కలెక్టర్, అధికారులు

నీటి సమస్యల పరిష్కారానికి ఎమర్జెన్సీ బృందాల ఏర్పాటు : సీఎస్

నిర్మల్ కల్చరల్, ఏప్రిల్ 10: నిర్మల్ జిల్లాల్లో నీటి సమస్యల పరిష్కారానికి ఎమర్జెన్సీ బృందాలు ఏర్పాటు చేసినట్లు సీఎస్ శాంతి కుమారి తెలిపారు. బుధవారం కలెక్టర్‌లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. త్రాగునీటి సమస్యల పరిష్కారం, వరి ధాన్యం కొనుగోలు, అమ్మ ఆదర్శ పాఠశాలల పనులు తదితర వాటిపై సమీక్షించారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో త్రాగునీటి సమస్య తలెత్తకుండా అన్ని చర్యలు చేపట్టాలని ఆదేశించారు. వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో అన్ని వసతుల కల్పన, టార్పాలిన్లను అందుబాటులో ఉంచాలన్నారు. వడదెబ్బపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలన్నారు. ఉపాధి హామీ పనులు జరిగేచోట ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని సూచించారు. కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్, అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్, ఇతర అధికారులు హాజరయ్యారు.

అనుమతి లేకుండా ఇసుక తరలిస్తే చర్యలు : సీఐ


కౌటలో ఇసుక ట్రాక్టర్‌లను పట్టుకున్న పోలీసులు

జైనథ్ రూరల్, ఏప్రిల్ 10: బేల మండలంలోని పెన్‌గంగా పరివాహక ప్రాంతాల్లో ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుకను తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని రూరల్ సీఐ సాయినాథ్ అన్నారు. బుధవారం జైనథ్ మండలంలో కౌట, డొల్లర, ఆనంద్‌పూర్ తదితర పెన్‌గంగా ఇసుక పరివాహక ప్రాంతాలను పరిశీలించారు. కౌటలో ఇసుక డంపును పరిశీలించారు. అక్కడ ఉన్న ఏడు ట్రాక్టర్‌లను సీజ్ చేసి పట్టుకున్న అనుమతి లేని ట్రాక్టర్‌లను జైనథ్ తహసీల్దార్ శ్యాంసుందర్ ముందు హాజరు పరచడం జరిగింది. బేల జైనథ్ పెన్‌గంగా పరివాహక గ్రామాలను మైన్స్ రెవెన్యూ అధికారులతో విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ సాయినాథ్ మాట్లాడుతూ ఇసుకను అక్రమంగా తరలిస్తే వారి పై క్రిమినల్ కేసులు నమోదు చేసి చట్టరీత్యా చర్యలు తీసుకుంటామన్నారు. సీఐ వెంట జైనథ్ మండల ఎస్సై వి.పురుషోత్తంలతో పాటు మైన్స్ రెవెన్యూ అధికారులున్నారు.

సమాచారం లేకుండా అధ్యక్షుడిని మార్చడం సరికాదు : జాడి

గుడిహత్నూర్, ఏప్రిల్ 10: తనకు సమాచారం లేకుండా తనను మార్చడం సరికాదని బీజేపీ మాజీ మండల అధ్యక్షుడు జాడి సుభాష్ అన్నారు. బుధవారం మండలకేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ గత నాలుగేళ్లుగా బీజేపీ మండల అధ్యక్షుడిగా పని చేసి పార్టీ బలోపేతం కోసం కృషి చేశానన్నారు. జిల్లా అధ్యక్షుడు పతంగే బ్రహ్మానంద్ అధ్యక్షుడిని మార్చడం ఆశ్చర్యానికి గురి చేసిందన్నారు. మండల అధ్యక్షుడిగా కొనసాగుతున్న నన్ను గాని పార్టీ కార్యకర్తలను సంప్రదించకుండా కొత్త అధ్యక్షుడిని నియమించేందుకు ఏకపక్షంగా నిర్ణయం తీసుకోవడం సరైంది కాదన్నారు.

బజార్‌హత్నూర్: బజార్‌హత్నూర్ మండలం నూతన బీజేపీ కన్వీనర్ నియామాకంపై మండలం పార్టీ కార్యకర్తలలో అంతర్గత అసహనం వ్యక్తమవుతోంది. మాజీ మండల కన్వీనర్ బత్తిని సుధాకర్ మాట్లాడుతూ పార్టీ ఆదేశాలను అనుసరిస్తూ ప్రతీ కార్యక్రమాన్ని ముందుండి తీసుకు వెళ్లానని, నూతన కన్వీనర్‌ను నియమించే ముందు కనీసం మండల కార్యకర్తలతో చర్చించకుండా మండల కన్వీనర్‌ను నియమించడం పట్ల ఆయన అసహనం వ్యక్తం చేశారు. నిస్వార్థంగా పార్టీ కార్యక్రమాలను నిర్వహిస్తున్న తనకు కనీసం సమాచారం లేదన్నారు. తనకు ఉన్న బాధ్యతలన్నింటికీ రాజీనామా చేస్తున్నానని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రదాన కార్య దర్శి బలిరాం, బీజేవైఎం మండల అద్యక్షుడు కొడారి శ్రీకాంత్, ఓబీసీ మండల అధ్యక్షుడు నారడి లింగన్న, సీనియర్ నాయకులు శ్రీనివాస్, శంకర్, తదితరులు పాల్గొన్నారు.

బోథ్: బోథ్ నియోజకవర్గంలోని బోథ్‌తో పాటు పలు మండలాల కన్వీనర్‌ల నియామకం పట్ల పార్టీలో అంతర్గతంగా కుమ్ములాటలు మొదలయ్యాయి. కన్వీనర్ల నియామకం ఏకపక్షంగా జరిగిందంటూ ఆ పార్టీ కార్యకర్తలు ఆగ్రహం వ్యక్తపరుస్తున్నారు. నేరడిగొండ మండలం కార్యకర్తలు ప్రెస్‌మీట్ పెట్టి ఈ విషయంలో ఏకపక్ష నిర్ణయం తీసుకున్నారు అంటూ.. పార్టీ నాయకత్వంపై ఆగ్రహం వ్యక్తపరిచారు. మరో వైపు బజార్‌హత్నూర్ మండలంలోని పలువురు సీనియర్ నాయకులు సైతం కన్వీనర్ ఎంపిక పట్ల అసంతృప్తి వ్యక్తపరుస్తున్నారు. ఇక బోథ్‌లో సహితం ఆ పార్టీ కార్యకర్తలు అధిష్ఠానంకు ఈ విషయమై ఫిర్యాదు చేస్తున్నట్లు తెలిసింది. కన్వీనర్ నియామకం విషయంలో జిల్లా నాయకత్వం కనీస సంప్రదింపులు జరుపకుండా సీనియర్లను అడగకుండా బోథ్ అధ్యక్షులు దృష్టికి తీసుకువెళ్లకుండా నియామకాలు చేపట్టారని పేర్కొంటున్నారు. పరిస్థితి ఇలాగే ఉంటే పార్లమెంట్ ఎన్నికల్లో తాము ఏమిటో చూపెడతామంటూ పేర్కొనడం గమనార్హం.

'పోలింగ్ బూత్ అధ్యక్షుల అభిప్రాయాలు తీసుకోకపోవడం సరికాదు'

నేరడిగొండ, ఏప్రిల్ 10: మండల అధ్యక్ష ఎన్నిక విషయంలో జిల్లా కోర్ కమిటీ, స్థానిక నాయకులకు గాని, పోలింగ్ బూత్ అధ్యక్షుల అభిప్రాయాలు పరిగణలోకి తీసుకోకుండా కొత్త అధ్యక్షున్ని నిర్ణయించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని బీజేపీ మండల నాయకులు అన్నారు. మండలకేంద్రంలో బుధవారం మండల అధ్యక్షుడు సోశయ్య, హీరాసింగ్ మాట్లాడారు. ఇలాంటి నిర్ణయాల వల్ల పార్టీకి రానున్న రోజులలో నష్టం జరుగుతుందని అన్నారు. వారితో పాటు దీనిలో గిరిజన మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి తొడసం శంకర్, జిల్లా కార్యవర్గ సభ్యులు గందం, నవీన్, కిసాన్ మోర్చా ప్రధాన కార్యదర్శి ప్రభాకర్, మండల ఉపాధ్యక్షుడు కటకవల్, ఉత్తం, ప్రధాన కార్యదర్శి సోలంకి ప్రశాంత్, తదితరులునారు.

ఎన్నికల నిబంధనలు పాటించకపోతే చర్యలు : సీఐ రమేష్

బోథ్, ఏప్రిల్ 10: ఎన్నికల నిబంధనలను ప్రతిఒక్కరూ పాటించాలని నిబంధనలకు వ్యతిరేకంగా ఎవరూ వ్యహరించిన కేసుల్లో ఇరుక్కుంటారని బోథ్ సీఐ రమేష్ పేర్కొన్నారు. బుధవారం మండలంలోని మరలపెల్లి గ్రామాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామస్తులతో సమావేశమై మాట్లాడారు. ఎన్నికలు సమీపిస్తున్నందున ప్రశాంత వాతావరణంలో ఓటు వేయాలని సూచించారు. గ్రామాల్లో ఎవరైనా అల్లర్లకు పాల్పడితప చర్యలు తప్పవని పేర్కొన్నారు. మరోవైపు అక్రమంగా మద్యం ఉంచి విక్రయించినట్లయితే కేసులు పెట్టకుండా ఉండాలేమన్నారు. గ్రామంలోకి ఎవరైనా కొత్త వ్యక్తులు వస్తే సమాచారం ఇవ్వాలని సూచించారు. గ్రామంలో సీసీ కెమెరాలు మరమ్మతులు చేయించాలని ప్రధాన కూడళ్లలో వాటి ఏర్పాటు చేయాలని సూచించారు. సీఐ వెంట కానిస్టేబుల్ గాడ్గే రమేష్, మాజీ సర్పంచ్ దేవేందర్, గ్రామస్థులు లాడే వాకర్ తుకారం, తదితరులు పాల్గొన్నారు.

వడూర్ ప్రీమియర్ లీగ్ ప్రారంభం

నేరడిగొండ, ఏప్రిల్ 10: మండలంలోని వడూర్ గ్రామంలో నిర్వహించిన వడూర్ ప్రీమియర్ లీగ్ (డబ్ల్యుపీఎల్) క్రికెట్ పోటీలను ముఖ్య అతిథిగా తెలంగాణ రాష్ట్ర అధ్యాపకుల సంఘం ప్రధాన కార్యదర్శి బలరాం జాదవ్ హాజరై ప్రారంభించారు. క్రీడల వల్ల యువకుల్లో ఉన్న పోటీతత్వం బయట పడుతుందని, ఈ పోటీలలో క్రీడాకారులు పాల్గొని వారి ప్రతిభను చాటి జిల్లా స్థాయి, రాష్ట్ర స్థాయి క్రికెట్‌లో ఆడాలని అన్నారు.


ఓఆర్ఎస్ వాడకంపై అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

'వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి'

తాంసి, ఏప్రిల్ 10: ప్రస్తుతం ఎండల తీవ్రత రోజురోజుకు పెరగడంతో వ్యాధులు సోకే ప్రమాదం ఉందని ఈ విషయంలో ప్రజలు అప్రమత్తం ఉండాలని ఎంపీడీవో గడ్డం మోహన్‌రెడ్డి అన్నారు. బుధవారం సాయంత్రం మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో వైద్య సిబ్బందితో ప్రజలు ఓఆర్ఎస్ ఎలా వాడాలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ ఉపాధి కూలీలు తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ముఖ్యంగా ప్రజలు ఉదయం పూట పనులకు వెళ్లి మధ్యాహ్నం బయటకు వెళ్లకుండా ఉండాలని సూచించారు. ఏదైనా వ్యాధులు సంభవించినట్లు అయితే వెంటనే తాంసి పీహెచ్‌సీలో సంప్రదించాలని కోరారు. వైద్య సిబ్బంది వారివారి విధులను బాధ్యతగా నిర్వహించాలని ఆదేశించారు. ఇందులో ఏపీవో సంగీత, సూపరింటెండెంట్ రవీందర్, వైద్య సిబ్బంది, తదితరులు ఉన్నారు.


'వైద్యుల నిర్లక్ష్యంతో గర్భిణి మృతి'

సిరికొండ రూరల్, ఏప్రిల్ 10: కడుపులోని బిడ్డతో సహ ఎనిమిది నెలల గర్భిణి వైద్యుల నిర్లక్ష్యం కారణంగానే ప్రాణాలు కోల్పోయిందని కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం.. సిరికొండ మండలంలోని పొన్న గ్రామ పంచాయతీ పరిధిలోని పొన్న ఎక్స్‌రోడ్‌కు చెందిన పెందూర్ విమలబాయి(25) ఏడు నెలల గర్భిణి. కాగా ఆమెకు మంగళవారం సాయంత్రం వాంతులు, విరేచనాలు కావడంతో ఇచ్చోడ పీహెచ్‌సీకి తీసుకెళ్లారు. అక్కడ డాక్టర్లు ఎవరూ లేకపోవడంతో వచ్చీ రానీ వైద్యంతో అక్కడ విధుల్లో ఉన్న వైద్య సిబ్బంది వైద్యం అందించడంతో గర్భిణి పరిస్థితి విషమించింది. దీంతో వైద్య సిబ్బంది ఆదిలాబాద్‌లోని రిమ్స్‌కు తరలించేందుకు ఏర్పాట్లు చేశారు. అంతలోపే మార్గమధ్యలో విమలబాయి మృతి చెందింది. చారు. అప్పటికే నాలుగు గంటలు దాటిపోయింది. దీంతో మృతురాలికి చాలా ఇబ్బంది కావడంతో వైద్య సిబ్బందిని కుటుంబీకులు ప్రశ్నించారు. దీంతో అక్కడ ఉన్న వైద్యసిబ్బంది ఆదిలాబాద్‌లోని రిమ్స్‌కు రెఫర్ చేశారు. అయితే రిమ్స్‌కు తరలించే క్రమంలో మార్గమధ్యలో విమలాబాయి చనిపోయినట్లు కుటుంబీకులు తెలిపారు. కాగా, విధుల్లో నిర్లక్ష్యం వహించిన వైద్యులను విధుల నుంచి తొలిగించాలని తుడుందెబ్బ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొడప నగేష్ డిమాండ్ చేశారు. అలాగే, ఆదివాసీల పట్ల నిర్లక్ష్యం కారణంగానే ఏజెన్సీలో మరణాలు సంభవిస్తున్నాయని, బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని, బాధ్యులపై తగిన చర్యలు తీసుకోవాలని తుడుందెబ్బ జిల్లా అధ్యక్షుడు పుర్కు బాపురావు స్పష్టం చేశారు.

ఇద్దరు నేరస్థులకు జైలు

ఆదిలాబాద్ అర్బన్, ఏప్రిల్ 10: ఆదిలాబాద్ పట్టణంలో గత కొన్ని రోజుల నుంచి అక్రమంగా దేశీదారు విక్రయిస్తున్న ఇద్దరు నేరస్థులకు ఐదు నెలల జైలు శిక్ష విధించినట్లు ఆదిలాబాద్ అర్బన్ తహసీల్దార్ పేర్కొన్నారు. 110 సీఆర్‌పీసీ కింద బైండోవర్ అయిన తర్వాత కూడా దేశీదారు విక్రయాలు జరిపినందుకు గాను బైండోవర్ నిబంధనలు ఉల్లంఘించినందుకు వారికి జైలు శిక్ష విధించినట్లు పేర్కొన్నారు. అనంతరం ఇద్దరు నేరస్థులను జైలుకు తరలించినట్లు ఎక్సైజ్ ఇన్స్‌పెక్టర్ రేండ్ల విజేందర్ తెలిపారు.

andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
బుధవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 38.7 : కనిష్ఠం 22.4



బీజేపీ పెంబి మండల కార్యవర్గం ఎన్నిక

పెంబి,ఏప్రిల్ 10 : బీజేపీ పెంబి మండల కార్యవర్గాన్ని బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఓబీసీ మండల అధ్యక్షుడిగా పర్వతాల లక్ష్మీనారాయణ, కిసాన్‌మోర్చా అధ్యక్షుడిగా పుప్పాలరవి, ఎస్టీ మోర్చా అధ్యక్షుడిగా ప్రకాష్, ఎస్సీ మోర్చా అధ్యక్షుడిగా బాపురావు, బీజేవైఎం అధ్యక్షుడిగా రాము, సోషల్ మీడియా కన్వీనర్‌గా భూక్యా శ్రీనివాస్, కో కన్వీనర్‌గా సురేష్, ఉపాధ్యక్షులుగా పాండురంగ, వెంకటి, మహేష్, గణేష్, ప్రధాన కార్యదర్శులుగా నాగరాజు, టీకాజీ, ప్రకాష్, సుదర్శన్, జాయింట్ సెక్రటరీ రాజబాబు, జనార్ధన్, శేఖర్‌లు ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో నర్సయ్య, గోపాల్, రాజు పాల్గొన్నారు.



పల్లెల్లో పట్టు కోసం..

కొత్త ఎత్తులు!

గ్రామాభివృద్ధి కమిటీలకు ప్రధాన పార్టీల జై!

- గ్రామాభివృద్ధి కమిటీలను ప్రసన్నం చేసుకునేందుకు నేతల పాట్లు
- గ్రామస్థాయి నాయకులతో ప్రధాన పార్టీల లీడర్ల సమావేశాలు
- మాకు ఓట్లేస్తే మీ జోలికి రాబోమంటూ అభయ హస్తం
- నిధులు, పనుల మంజూరుకు హామీలు
- జిల్లాలో మొదలైన రాయబారాలు

నిర్మల్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి)

జిల్లాలోని పల్లెల్లో గ్రామాభివృద్ధి కమిటీ (వీడీసీ)లు సమాంతర వ్యవస్థను నడిపిస్తూ ప్రజాస్వామ్య బద్ధంగా ఎన్నికైన ప్రజాప్రతినిధులను శాసిస్తున్నాయన్నది బహిరంగ రహస్యమే. ప్రతీ ఎన్నికల సమయంలో అంతో ఇంతో పట్టును నిరూపించుకునే జిల్లాలోని గ్రామాభివృద్ధి కమిటీలు ఈసారి మాత్రం తమ ఆధిపత్యాన్ని మరింత చాటుకునేందుకు సిద్ధమవుతున్నాయి. గతంలో కేవలం గ్రామాల్లో జరిగే చిన్న చిన్న తగాదాలను పరిష్కరించేందుకు అలాగే అభివృద్ధి పనులకు సంబంధించిన సూచనలు, సలహాలు ఇచ్చేందుకు మాత్రమే ఈ వీడీసీలు పని చేసేవి. క్రమంగా గ్రామంలోని అన్ని వ్యవహారాలను తమ గుప్పిట్లోకి తీసుకొని ప్రజాప్రతినిధులను డమ్మీగా మార్చేశాయన్న ఆరోపణలున్నాయి. ఈసారి లోక్‌సభ ఎన్నికలు పోటాపోటీగా జరగనుండడమే కాకుండా ఆయా పార్టీలు పెద్ద మొత్తంలో డబ్బులు ఖర్చు చేయనున్నాయి. ఈ నేపథ్యంలో వీడీసీలను ప్రసన్నం చేసుకునేందుకు అన్ని రాజకీయ పార్టీలు ఇప్పటి నుండే సిద్ధమవుతున్నాయి. అధికార కాంగ్రెస్ పార్టీతో పాటు బీజేపీ, బీఆర్ఎస్‌లు సైతం వీడీసీలను ప్రసన్నం చేసుకునేందుకు ఇప్పటి నుండే పావులు కదుపుతుండడం ఆసక్తికరంగా మారుతుంది. వీడీసీలను ప్రసన్నం చేసుకునేందుకు మండల స్థాయి పార్టీలు ఇప్పటి నుంచే ప్రయత్నాలు మొదలుపెట్టారు. గ్రామంలో ప్రభుత్వ కార్యక్రమాలకు వీడీసీ సభ్యులను ఆహ్వానించి వారిని సన్మానిస్తున్నారు. అలాగే నిధుల కేటాయింపు, ఇతర అంశాలపై హామీలిస్తున్నారు. పలు జిల్లాల్లో వీడీసీలు గ్రామ పరిపాలన వ్యవస్థను అనధికారికంగా తమ గుప్పిట్లో పెట్టుకుని ప్రజాస్వామ్యయుతంగా ఎన్నికైన ప్రజాప్రతినిధులను డమ్మీ చేస్తున్నాయన్న ఆరోపణలున్నాయి. ఇప్పటికే పలు గ్రామాల్లో వీడీసీల బాధితులు వీరి ఆగడాలపై పోలీసులకు సైతం ఫిర్యాదులు చేసిన సంఘటనలున్నాయి. గ్రామాల్లో వీడీసీల తీర్మానాలను ధిక్కరించే వారిపై సామాజిక, గ్రామ బహిష్కరణలు లాంటి శిక్షలు కూడా అమలు చేస్తుంటాయి. ఇక్కడి సహజ వనరులను వీడీసీలు తమ ఆదాయ వనరులుగా మార్చుకుంటున్నారు. గ్రామంలో అభివృద్ధి పనుల పేరిట అడ్డగోలుగా డబ్బులు వసూలు చేస్తున్నట్లు కూడా ఫిర్యాదులు ఉన్నాయి. ముఖ్యంగా గ్రామ శివారులోని వాగులలో ఇసుకకు టెండర్లు నిర్వహించడం, మద్యం బెల్ట్ షాపులకు బహిరంగంగా వేలం పాటలు నిర్వహించడం, అలాగే కూల్ డ్రింక్ షాపులు, చికెన్ సెంటర్లకు కూడా వీడీసీలు వేలం పాటలు నిర్వహిస్తూ లక్షల రూపాయల్లో ఆదాయాన్ని సమకూరుస్తున్నాయి. అయితే ఈ డబ్బులను గ్రామ అభివృద్ధి కోసం ఖర్చు చేస్తున్నట్లు చెబుతుంటాయి. ఎవరైనా వీడీసీల ఆదేశాలను ధిక్కరిస్తే ఇక వారు గ్రామంలో ఒంటరి కావాల్సిందేనని అంటున్నారు. ఎమ్మెల్యే, ఎంపీపీ, జడ్పీటీసీ లాంటి ప్రజాప్రతినిధులు సైతం వీడీసీల మాటను ధిక్కరించేందుకు సాహసం చేయబోరంటున్నారు. గ్రామంలో ఏదైనా కార్యక్రమం జరిగితే దానికి సర్పంచ్ కన్నా ముందుగానే వీడీసీల అనుమతి తీసుకోవడం పలు జిల్లాల్లో సహజంగా మారిందంటున్నారు. అత్యంత బలంగా ఉన్న వీడీసీ వ్యవస్థ రాబోయే ఎన్నికల్లో రాజకీయ పార్టీలపై అత్యంత ప్రభావం చూపే అవకాశాలున్నాయంటున్నారు. తమ తమత గ్రామాల్లోని ఓటర్లను వీడీసీలు ప్రభావితం చేసే అవకాశాలున్న కారణంగా ప్రధాన రాజకీయ పార్టీలు ఇప్పటి నుండే వీడీసీలను ప్రసన్నం చేసుకునేందుకు ప్రయత్నిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. వీడీసీ మెంబర్లను ప్రధాన పార్టీలు ఇప్పటి నుంచే మచ్చిక చేసుకునేందుకు ప్రయత్నిస్తున్నాయని చెబుతున్నారు. వీడీసీలు ఇప్పటి నుండే తమకు పరోక్షంగా మద్దతు ప్రకటిస్తే ఆ వీడీసీల సభ్యులకు పెద్ద మొత్తంలో నజరానాలను కూడా ముట్టజెప్పేందుకు ఒప్పందాలు జరుగుతున్నాయంటున్నారు. దీనికోసం కొంతమంది గ్రామంలోని రాజకీయ నేతలు రాయబారాలు, బేరసారాలు కూడా నడుపుతున్నారని చెబుతున్నారు.

● ముందస్తు ఒప్పందాలకు సిద్ధమవుతున్న ప్రధాన పార్టీలు

ప్రతి ఎన్నికల మాదిరిగానే ఈసారి కూడా వీడీసీలతో ముందుగానే ఒప్పందాలు కుదుర్చుకునేందుకు బీజేపీ, కాంగ్రెస్ తదితర పార్టీలు పోటీ పడుతున్నాయని అంటున్నారు. ముఖ్యంగా అధికార కాంగ్రెస్ పార్టీ ఒకడుగు ముందుకేసి పలు గ్రామాల్లోని వీడీసీ సభ్యులతో ఇప్పటికే చర్చలు మొదలుపెట్టినట్లు చెబుతున్నారు. తాము చేస్తున్న అభివృద్ధి పనులతో పాటు రాబోయే రోజుల్లో మరిన్ని పనులు చేస్తామని అలాగే వీడీసీలకు కూడా సంపూర్ణ సహకారం అందిస్తామంటూ హామీలు ఇస్తున్నట్లు చెబుతున్నారు. దీనికోసంగాను వీడీసీ సభ్యులతో చర్చించేందుకు ఆయా గ్రామాల్లోని సీనియర్ నేతలను మధ్యవర్తులుగా నియమిస్తున్నట్లు పేర్కొంటున్నారు. ఈ మధ్యవర్తులు వీడీసీ సభ్యులతో వేరు వేరుగా మాట్లాడి మద్దతును కూడగట్టే ప్రయత్నాలు చేస్తున్నాయని అంటున్నారు. అయితే వీడీసీలలో గ్రామంలోని అన్ని కులాల వారు సభ్యులుగా ఉంటుండడంతో వీరిందరినీ ఒప్పించేందుకు ఇప్పటి నుండే ప్రయత్నాలు చేపడితే ఫలితం ఉంటుందని అధికార పార్టీ భావిస్తున్నదంటున్నారు.

● పల్లెల్లో వీడీసీల సమాంతర వ్యవస్థ

జిల్లాలోని చాలా గ్రామాల్లో వీడీసీ తమ ఆధిపత్యాన్ని చాటుకుంటున్నాయి. జిల్లాలోని 396 గ్రామ పంచాయతీలకు గాను దాదాపు 300ల గ్రామాల్లో వీడీసీలు పెత్తనం చెలాయిస్తున్నాయని అంటున్నారు. సర్పంచ్‌లు ఇతర ప్రజాప్రతినిధులను సైతం పక్కన పెట్టి ఈ వీడీసీలే అన్ని తామై వ్యవహరిస్తుండడం పలుసార్లు వివాదాస్పదమవుతున్నప్పటికీ.. ఈ వ్యవహారంలో మాత్రం మార్పు రావడం లేదు. ఒక్క అధికారిక కార్యక్రమాలు తప్ప మిగతా అన్ని రకాల కార్యకలాపాలు వీడీసీల కనుసైగల మేరకే జరుగుతుంటాయి. ఇప్పటికే వీడీసీలు గ్రామాల్లో అనధికారికంగా బెల్ట్ షాపులకు వేలం పాటలు నిర్వహించి అనుమతులు ఇస్తుండడం అలాగే వాగులు, చెరువులలోని ఇసుకకు సైతం వేలంపాటలు నిర్వహించి ట్రాక్టర్లు, టిప్పర్లలో తరలించేందు కోసం అనధికారిక రసీదులు కూడా జారీ చేస్తున్నాయి. కూల్ డ్రింగ్ షాపులు, చికెన్ సెంటర్ల నిర్వహణకు సైతం వీడీసీలు ప్రభుత్వ లైసెన్స్‌ల తరహాలో అనుమతులు జారీ చేస్తుండడం ప్రాధాన్యతను సంతరించుకుంటుంది. దీంతోపాటు ఆస్తులు, కుటుంబ తగాదాలకు సంబంధించిన పంచాయతీల తీర్పులు ఇవ్వడంలో కూడా వీడీసీలు ప్రధాన పాత్ర పోషిస్తున్నాయి. కాగా గత కొద్ది రోజుల నుంచి గ్రామీణ ప్రాంతాల్లో సైతం రియల్ ఎస్టేట్ వ్యాపారం విస్తరిస్తుండడంతో అనధికారిక వెంచర్లకు ఈ వీడీసీల అనుమతి తప్పనిసరవుతోంది. ఇలా అనధికారిక అనుమతులు ఇచ్చేందుకు రియల్ ఎస్టేట్‌ల నుంచి పెద్ద మొత్తంలో డబ్బులను వీడీసీలు గ్రామాభివృద్ధి నిధి పేరిట వసూలు చేస్తున్నట్లు కూడా ఆరోపణలున్నాయి. ఇలాంటి పరిస్థితుల నేపథ్యంలో రాబోయే లోక్‌సభ ఎన్నికలను వీడీసీలు పెద్ద ఎత్తున ప్రభావితం చేస్తాయని భావిస్తున్న పార్టీలు ఇప్పటి నుండే ఆ వీడీసీలను ప్రసన్నం చేసుకునేందుకు సిద్ధమవుతున్నాయి. ఈ క్రమంలో జిల్లాలో రాజకీయం రోజురోజుకూ రసవత్తరంగా మారుతోంది.

అలరించిన ఉగాది కవి సమ్మేళనం



అంబటికి ఉగాది పురస్కారం అందజేస్తున్న నిర్వాహకులు

నిర్మల్ కల్చరల్,ఏప్రిల్ 10: క్రోధినామ ఉగాది పర్వదినం సందర్భంగా మంగళవారం సాయంత్రం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన కవి సమ్మేళనం సాహిత్యాభిమానులు, స్థానిక ప్రజలను విశేషంగా అలరించింది. డాక్టర్ కావేరి ఫౌండేషన్, తెలంగాణ రచయితల వేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన సమ్మేళనంలో దామెర రాములు, నేరెళ్ల హన్మంతు, పత్తి శివప్రసాద్, వెంకట్, పురుషోత్తమ రావు, శ్రీనివాసాచారి, తదితర కవులు కవితాగానం చేశారు. క్రోధి నామ సంవత్సర విశిష్టత, ఫలితాలు తమ కవితల్లో వినిపించారు. ఈ సందర్భంగా ప్రముఖ కవి అంబటి నారాయణకు ఉగాది పురస్కారం అందజేసి సన్మానించారు.

ఘనంగా ప్రభుత్వ పాఠశాల ఫేర్‌వెల్ డే



పెంచికల్‌పాడ్ పాఠశాలలో నృత్యం చేస్తున్న విద్యార్థులు

కుంటాల,ఏప్రిల్, 10: కుంటాల మండలంలోని పెంచికల్ పాడ్ ప్రభుత్వ పాఠశాలలో ఫేర్‌వెల్ డేను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా 5వ తరగతి విద్యార్థులకు 4వ తరగతి విద్యార్థులు వీడ్కోలు సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం ఎల్లన్న మాట్లాడుతూ.. విద్యార్థులు కష్టపడి కాకుండా ఇష్టపడి చదవాలని సూచించారు. కష్టపడి చదివి తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థినీ విద్యార్థులు చేసిన పలు సాంస్కృతిక ప్రదర్శనలు పలువురిని ఆకట్టుకున్నాయి.

కాంగ్రెస్ పార్టీ సమావేశానికి నాయకులందరూ హాజరు కావాలి : నర్సయ్య

సారంగాపూర్, ఏప్రిల్ 10: మండలంలోని గల హర్ష ఫంక్షన్ హాల్‌లో గురువారం కాంగ్రెస్ పార్టీ సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ మండలాధ్యక్షుడు బొల్లోజి నర్సయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా జిల్లా పార్టీ అధ్యక్షుడు కూచాడి శ్రీహరి రావు హాజరవుతారని అన్నారు. ఈ సమావేశం సాయంత్రం నాలుగు గంటలకు ఉంటుందని, మండలంలోని ఆయా గ్రామాల పార్టీ నాయకులందరూ హాజరుకావాలని ఆయన కోరారు.

నేడు ఈద్-ఉల్-ఫితర్

● ముస్తాబైన జిల్లా ● భైంసాలో భద్రతా ఏర్పాట్లను పర్యవేక్షించిన జిల్లా ఎస్పీ జానకీ షర్మిల ● భారీ బందోబస్తు



భైంసాలో ప్రత్యేక ప్రార్థనల కోసం ముస్తాబైన ఈద్గా



భైంసాలో ఈద్గా వద్ద బందోబస్తును పర్యవేక్షిస్తున్న ఎస్పీ జానకీ



నిర్మల్‌లో రంజాన్ ఏర్పాట్లను పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మన్

భైంసా. ఏప్రిల్ 10: ముస్లింలు అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించుకునే రంజాన్ పర్వదిన వేడుకల కోసం జిల్లా ముస్తాబైంది. గురు వారం నిర్వహించిన పర్వదిన వేడుకల ప్రత్యేక ప్రార్థనల కోసం భైంసాలోని గడ్డెన్న వాగు ప్రాజెక్టు సమీపంలోని ఈద్గా వద్ద ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఆయా కాలనీల్లోని ప్రార్థన మందిరాలు, ఈద్గా వెళ్లే రోడ్డు మార్గంలో భారీ సైజ్‌లతో స్వాగత తోరణాలు, పర్వదిన శుభాకాంక్షలు తెలిపే ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకొని పలు మసీదుల వద్ద ప్రధానంగా గడ్డెన్నవాగు ప్రాజెక్టు సమీపంలోని ఈద్గా మైదానం వద్ద సామూహిక ప్రార్థనలను నిర్వహించబడుతాయని పట్టణ మత పెద్దలు పేర్కొన్నారు. పర్వ దినా న్ని శాంతియుత వాతావరణంలో భక్తిశ్రద్ధలతో ఆనందోత్సహాల మధ్య జరుపుకోవాలన్నారు.

● కొనుగోళ్లతో జిల్లాలో సందడే సందడి

రంజాన్‌ను ఘనంగా నిర్వహించుకునేందుకు ముస్లింలు జరిపిన వివిధ కొనుగోళ్లతో బుధవారం మార్కెట్ కొత్తశోభను సంతరించుకుంది. మార్కెట్ పరిధిలోని ప్రధాన ప్రాంతాలన్నీ కొనుగోలుదారులతో సందడిగా కనిపించాయి. ప్రధానంగా సేమియా విక్రయ కేంద్రాలు, బట్టల దుకాణాలు, జనరల్ స్టోర్స్ మహిళల కొనుగోళ్లతో కళకళ లాడాయి. రోడ్లపై వెలిసిన సెమియా కేంద్రాల వద్దకు అధిక సంఖ్యలో జనం తరలివచ్చి కొనుగోళ్లు చేపట్టారు.

● ఏర్పాట్లు పూర్తి

రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకొని నిర్వహించే ప్రత్యేక ప్రార్థనల కోసం గడ్డెన్నవాగు సమీపంలోని ఈద్గా వద్ద ఏర్పాట్లన్నీ పూర్తయినట్లుగా మున్సిపల్ వైస్ చైర్మన్ జాబీర్ అహ్మద్ తెలిపారు. ప్రత్యేక ప్రార్థనలకు వచ్చేవారికి ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా ఏర్పాట్లు చేపట్టామన్నారు. పట్టణం నుంచి ఈద్గా వరకు గల రోడ్డు మార్గాన్ని పూర్తి స్థాయిలో మెరుగుపరచామన్నారు. నీటి వసతి సైతం కల్పించామన్నారు.

● భారీ బందోబస్తు

ప్రత్యేక ప్రార్థనల సందర్భంగా పోలీసు శాఖ పట్టణంలోని ఈద్గా వద్ద భారీ బందోబస్తు చర్యలు చేపట్టింది. ఏఎస్పీ కాంతిలాల్ పాటిల్, టౌన్ సీఐ రాజారెడ్డిల నేతృత్వంలో భద్రతా ఏర్పాట్లు చేపట్టారు. బుధవారం సాయంత్రం నుంచే పోలీసు శాఖ ఈద్గా వద్ద బందోబస్తు ఏర్పాట్లను చేపట్టారు. బుధవారం జిల్లా ఎస్పీ జానకీ షర్మిల భైంసాలో పర్యటించి స్థానిక ఈద్గా వద్ద ప్రత్యేక ప్రార్థనల కోసం చేపట్టిన ఏర్పాట్లు, భద్రతా చర్యలను పర్యవేక్షించారు.

● ముస్తాబైన నిర్మల్

నిర్మల్ కల్చరల్ : పవిత్ర రంజాన్ పర్వదినాన్ని గురువారం ముస్లిం సోదరులు జరుపుకోనున్నారు. ఉపవాస దీక్షలు బుధవారం సాయంత్రంతో ముగిశాయి. పట్టణ కేంద్రంలోని ప్రార్థన స్థలాలను అందంగా అలంకరించారు. నిర్మల్‌లోని ఈద్గామ్ ఈద్గా వద్ద పెద్ద ఎత్తున ప్రార్థనలు జరుపుతారు. జుమా మసీద్, ఎన్టీఆర్ మార్కెట్ వద్ద గల మసీద్, ఇతర ప్రాంతాల్లో అధికార యంత్రాంగం భారీ ఏర్పాట్లు చేసింది. మున్సిపల్ చైర్మన్ ఈశ్వర్, ఎస్పీ జానకి షర్మిల ప్రార్థన స్థలాల వద్ద ఏర్పాట్లు పరిశీలించారు. గట్టి పోలీసు భద్రత ఏర్పాటు చేసినట్లు ఎస్పీ తెలిపారు. ప్రార్థనలకు వచ్చే సోదరులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అన్ని ఏర్పాట్లు చేశామని చైర్మన్ ఈశ్వర్ తెలిపారు. విద్యుత్, త్రాగునీరు, పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టామన్నారు. డీఎస్పీ గంగారెడ్డి, కమిషనర్ రాజు, కౌన్సిలర్లు ఏర్పాట్లు పరిశీలించారు.

బాసర ఆలయ ఈవోకు చార్జ్ మెమో జారీ

● దేవాదాయ శాఖ కమిషనర్ ఉత్తర్వులు



బాసర సరస్వతీ దేవస్థానం

బాసర, ఏప్రిల్, 10: బాసర సరస్వతీ అమ్మవారి ఆలయంలో నిత్యావసర సరుకుల కొనుగోలు అవకతవకలపై ఆలయ ఈవో విజయరామారావుకు దేవాదాయ శాఖ కమిషనర్ హన్మంత్ రావు చార్జ్‌మెమో జారీ చేశారు. ఈ మేరకు కమిషనర్ కార్యాలయం నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి. ఆలయంలో ప్రసాదాల తయారీతో పాటు దేవస్థానంలో వివిధ విభాగాలకు నిత్యావసర సరుకులతో పాటు ఇతర అవసరాలకు కొనుగోలు చేసే మరికొన్ని వస్తు సామగ్రి కొనుగోళ్లలో భారీగా చోటుచేసుకున్న అక్రమాలపై గత నెల మార్చి 31వ తేదీన 'బాసరలో భోంచేస్తున్నారు' అనే శీర్షికతో కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. అనంతరం దేవాదాయ శాఖ కమిషనర్ విజిలెన్స్ విచారణకు ఆదేశించారు. విచారణ నివేదిక ఆధారంగా ఆలయ ఈవోకు చార్జ్‌మెమోను బుధవారం జారీ చేశారు. ప్రధానంగా అందులో మూడు విషయాలను ప్రస్తావించినట్లు సమాచారం. మార్కెట్ ధరల కంటే, ఎంఆర్‌పీ ధరల కంటే ఎక్కువ ధరలకు సరుకులను ఎందుకు కొనుగోలు చేయాల్సి వచ్చిందో చెప్పాలని ప్రస్తావించారు. రెండవది దేవస్థానంలో రికార్డు ప్రకారం ఉండాల్సిన సరుకులు తక్కువగా ఎందుకున్నాయో తెలపాలని ఈవో నుంచి సమాధానం కోరినట్లు తెలిసింది. మూడవది సరుకుల కొనుగోలు టెండరు సమయంలో మార్కెట్ ధరల కంటే ఎక్కువ ధరలు కోడ్ చేసిన ఖరారు చేయడం, స్టోర్ రూమ్‌లో సరుకులు రికార్డు ప్రకారం లేకపోవడం, నాన్ ఫోకల్ ఉద్యోగికి లడ్డూ తయారీ, స్టోర్ రూమ్‌లో కీలకమైన అధికార బాధ్యతలు ఇవ్వడం ఇలా పరిపాలనలో నిర్లక్ష్యంపై ఆలయ ఈవో అభిప్రాయాలు అడిగినట్లు సమాచారం. కాగా.. ఆలయ ఏఈవో సుదర్శన్ గౌడ్‌ను వివరణ కోరగా.. చార్జ్‌మెమో వచ్చిన విషయం వాస్తవమేనన్నారు.